క్లుప్తంగా

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం



తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరుకు చెందిన వడ్రంగి కార్మికుడు షేక్ షయాబ్ నోటి క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. విషయం తెలుసుకున్న అంగలకుదురు గణేష్ యూత్ సభ్యులు అతనికి ఆర్థిక సాయం అందజేశారు. పెదరావూరులోని షయాబ్ ఇంటికి ఆదివారం వెళ్లిన సభ్యులు రూ.42 వేల నగదు అందజేశారు. వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, షేక్ సలాం, ఎల్‌ఎంఎల్ ఖాదర్, పాలడుగు జగన్, జానీ బాషా, రసూల్ అతని వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేశారు.

సంఘస్తులకు సత్కారం



తెనాలి: పట్టణ ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చిలో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా జరిపారు. 'తండ్రి-వరములు' అనే అంశంపై సంఘ కాపరి, దైవజనులు బ్రదర్ ఆనందన్న ప్రసంగించారు. కుటుంబంలో తండ్రి పాత్ర గురించి బైబిల్ గ్రంథములోని అంశాలను ఆయన తెలియజేశారు. సంఘములో ఉన్న తండ్రులకు సంఘస్తులు శాలువా, నగదు బహుమతులతో సత్కరించారు. దైవ సేవకురాలు పి.రత్న కుమారి, చార్లెస్ వెస్లీ, పి ప్రశాంత్ బాబు, ఎస్.సీమోను, సంఘస్తులు పాల్గొన్నారు.

కుష్టు రోగులకు చేయూత



తెనాలిరూరల్: కుష్టు రోగులకు సాయం చేయడంలో ఆత్మ సంతృప్తి ఉందని సినీ దర్శకుడు దిలీప్ రాజా చెప్పారు. రూరల్ మండలం పెదరావురులోని పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కుష్టు రోగులకు నూతన వస్త్రాలు, నిత్యావసర వస్తువులతో పాటుగా ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. సమావేశానికి సంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి అధ్యక్షత వహించి మాట్లాడారు. తమకున్న దాంట్లో లేని వారికి సాయం చెయ్యాలనే సంకల్పంతో 2002 నుంచి పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ కుష్టు రోగులకు, ఎయిడ్స్ బాధితులకు, వితంతువులకు సహాయం చేస్తున్నట్టు తెలిపారు. ప్రాథమిక స్థాయిలో కుష్టు వ్యాధిని గమనించి, గుర్తించి తగిన చికిత్సను డాక్టర్ ద్వారా తీసుకోవలసిందిగా రోగులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో పాస్టర్ మట్లపూడి జోషి, ఇంటూరి విజయభాస్కర్, వెంకీ రావణ్ పాల్గొన్నారు.

అర్చక సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక

కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్చక సేవా సంఘం, అర్చక జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. కొల్లిపర బ్రాహ్మణ ఐక్యవేదిక సంఘ భవనంలో రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు నారాయణం వేణుగోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వర శర్మ , రాష్ట్ర కార్యదర్శి పరాశరం జగన్నాథ ఆచార్యులు సమక్షంలో ఎన్నిక జరిగింది. కొల్లిపర మండల అర్చక సమైక్య ఎన్నికల్లో ఏకగ్రీవంగా మండల అధ్యక్షునిగా మాల్యవంతం వెంకటరమణాచార్యులు, మండల ఉపాధ్యక్షునిగా పావులూరి వీలా నాగ చలపతిరావు, ప్రధాన కార్యదర్శిగా కొల్లిపర అవినాష్ , ఉప కార్యదర్శిగా కొల్లిపర నిరంజన్ కుమార్ , సహాయ కార్యదర్శిగా అశ్విని కుమార్, కోశాధికారిగా చిలుమూరు సుబ్బారావుతో పాటు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులుగా 16 మందిని ఎన్నుకొన్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యులు ప్రతి ఒక్కరూ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారాలకు కృషి చేస్తూ వారి అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 20వ వార్షికోత్సవం సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పి.వీరేశం గుప్త ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు వేదపండితులు నారాయణం గోవర్ధన రఘురామ్ నిర్వహిస్తారన్నారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం విశ్వక్సేన పూజ, మండపారాధన, పుణ్యాహవాచనం నిర్వహించి సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామివార్ల ఉత్సవ మూర్తులకు శాంతికళ్యాణం నిర్వహించి ప్రసాదాలు అందజేస్తామన్నారు. కార్యక్రమాలను కె. పేరారెడ్డి పర్యవేక్షిస్తారని చెప్పారు.

విద్యతో సంఘీయుల అభివృద్ధి

యాదవ విద్యార్థుల అభినందన సభలో డాక్టర్ అఖిలేష్



నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

తెనాలి: యాదవ ఎంప్లాయిస్ ఫౌండేషన్, తెనాలి ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, పుస్తకాలను అందజేశారు. స్థానిక బృందావన రెసిడెన్సీ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం జరిగిన సమావేశంలో పట్టణానికి చెందిన వైద్య ప్రముఖుడు డాక్టర్ తాడిబోయిన అఖిలేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫౌండేషన్ ఇస్తున్న ప్రోత్సాహకాలతో సంఘీయులైన విద్యార్థులు కాలేజీ చదువులను మరింత ప్రతిభావంతంగా పూర్తి చేయాలని డాక్టర్ అఖిలేష్ సూచించారు. విద్య అనేది ప్రగతికి మూలమని, చదువుకునే వయసులో పట్టుదలతో చదువుకుంటే ఉన్నతమైన భవిష్యత్ ఉంటుందని సోదాహరణంగా వివరించారు. విద్యార్థి జీవితంలో మొబైల్‌ఫోన్, టీవీకి సాధ్యమైనంత దూరంగా ఉండాలన్నారు. ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యావంతమైన సమాజం నేటి అవసరమని చెబుతూ, యాదవ విద్యార్థులు చక్కగా చదువుకుని ఆ సమాజంలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి సంవత్సరం యాదవ విద్యార్థులకు పదో తరగతిలో మెరిట్ మార్కులు సాధించిన వారికి ఇచ్చే నగదు ప్రోత్సాహకాలను ఈ పర్యాయం 55 మంది విద్యార్థులకు అందజేశారు. పదో తరగతి తర్వాత ఏమేం చదువులు ఉన్నాయనే అంశాన్ని కెరీర్ గైడెన్స్ నిపుణులచే చెప్పించారు. యాదవ సామాజికవర్గ ప్రముఖులు తాడిబోయిన హరిప్రసాద్, తట్టుకూళ్ల అశోక్ యాదవ్, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, కుర్రా శ్రీనివాస్, పెరుగు పెదబాబు, మీసాల బాలాజీ, సురేష్ బాబు, ఏసు బాబు, సోలా శంకర్, కరేటి రవి, వెంకట కృష్ణా రావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు ఎనికపల్లి అంబరీషుడు, అంగిరేకుల ప్రసాద్‌బాబు, కుర్రా శ్రీనివాసరావు, తాడిబోయిన శ్రీనివాస పండిట్, ఆరాధ్యుల నాగాంజనేయులు, తాడిబోయిన లక్ష్మీనారాయణ, కొత్తగొర్ల శ్రీనివాస్ పర్యవేక్షించారు.



విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

విద్యార్థులకు నగదు పురస్కారాలు

తెనాలి: పట్టణానికి చెందిన సేవాసంస్థ వేజళ్ల వెంకట సుబ్బారావు మెమోరియల్ విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్‌లో సాయంత్రం జరిగిన కార్యక్రమంలో తెనాలి మున్సిపాలిటీలోని ఉన్నత పాఠశాలల్లో గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 560 మార్కులు పైగా సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు రూ.1,116 చొప్పున ప్రతిభా పురస్కారాలను అందించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమా మహేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో మరింత శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ట్రస్టు కార్యదర్శి వేజళ్ల నవ్య మాట్లాడుతూ గత పదేళ్లుగా ట్రస్టు ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బీసీ కాలనీలో వేజళ్ల వెంకట సుబ్బారావు పురపాలక ప్రాథమిక పాఠశాల నిర్మాణం, ప్లాస్టిక్ వినియోగానికి ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచుల పంపిణీ, విద్యార్థి దశలోనే పుస్తక పఠనానికి ప్రోత్సాహం, విద్యార్థుల్లోని సృజనను వెలికి తీసేందుకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్టు గుర్తుచేశారు. ప్రతిభ కనపరచిన పేద విద్యార్థుల ఉన్నత చదువులకు, వృద్ధాశ్రమాలకు ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఓంకార్ గ్రాఫిక్స్ ప్రసాద్, సీఆర్‌పీ శ్రీదేవి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఉపాధ్యాయులు శివప్రసాద్, భాస్కరరావు, శ్యామ్ ప్రసాదు, టి.శివ ప్రసాదు, శ్రీనివాసరావు, బి.శివ రామకష్ణ, రాజేంద్ర, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్కివారిపాలెంలో డయేరియా తగ్గుముఖం



ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది



శాంపిల్స్ పరిశీలిస్తున్న అధికారులు

- గ్రామంలో తాగునీరు, ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరణ
- కొనసాగుతున్న వైద్య శిబిరం

అక్కివారిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు పీహెచ్‌సీ పరిధిలోని పెదపులివర్రు పంచాయతీ శివారు అక్కివారిపాలెంలో డయేరియా ప్రస్తుతం అదుపులో ఉన్నట్లు వైద్యురాలు చావలి రామలక్ష్మి తెలిపారు. ఆదివారం సైతం గ్రామంలో వైద్య శిబిరం కొనసాగింది. రామలక్ష్మి మాట్లాడుతూ శనివారం వచ్చిన రెండు కేసులు మినహా మరలా ఏ కేసు నమోదు కాలేదని పేర్కొన్నారు. ఆదివారం శిబిరంలో ఆరుగురికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరిస్థితి అదుపులోకి వచ్చేంతవరకు శిబిరాన్ని కొనసాగిస్తామన్నారు. అక్కివారిపాలెంలో డయేరియా కేసులు నమోదవడంతో గుంటూరు నుంచి మెడికల్ కళాశాల అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది గ్రామానికి వచ్చారు. స్థానికులు తాగుతున్న చేతి పంపుల నీటిని, పెదపులివర్రు రైల్వేగేట్, అక్కివారిపాలెం రహదారి పక్కనే ఉన్న చేతి పంపు వద్ద నుంచి వాటర్ శాంపిల్స్ సేకరించారు. గ్రామంలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమానికి సంబంధించి జరిగిన భోజనాలలో భాగంగా ఓలేరు ఆర్వో ప్లాంట్, పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని ఆర్వో ప్లాంట్ నుంచి కూడా తాగునీటి శాంపిల్స్ తీసుకున్నారు. కార్యక్రమం జరిగిన గృహం నుంచి ఆహార పదార్థాల ముడి పదార్థాలను సేకరించారు. గ్రామంలో ఎప్పటి నుంచో చెడిపోయిన బోర్‌వెల్‌ను తొలగించమని పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు తెలిపారు. పరిస్థితి తీవ్ర తరం కావడంతో సచివాలయ అధికారులు ఆదివారం ఉదయం హుటాహుటిన ఆ బోరును తొలగించి తమ చేతులు దులుపుకున్నారు. గ్రామంలో ఇలాంటి పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం గమనార్హం. ఎవరికి వారు తమకు పట్టనట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు విమర్శిస్తున్నారు. కేవలం వైద్య, ఆరోగ్య సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉండి ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించి అవసరమైన వారికి మందులు, సిలైన్లు పెట్టిస్తున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.శౌరిరాజు, ఎంపీహెచ్‌ఈవో కె. నాగేశ్వరరావు, హెచ్‌ఎస్ శ్రీనివాసరావు, హెచ్‌వీ రాజ్యలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.


కార్మెల్ మాతకు భక్తుల మొక్కులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు ఆదివారం అనేక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉదయాన్నే ఖమ్మం, ధర్మవరం, కర్నూలు, వెంకటపాలెం ప్రాంతాల నుంచి పలు వాహనాల్లో భక్తులు చేరుకున్నారు. ఉదయాన్నే బాల ఏసు దేవాలయంలో నిర్వహించిన దివ్యపూజాబలి కార్యక్రమంలో పాల్గొని కొండను ఎక్కారు. తలనీలాలు సమర్పించి , కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టారు. కార్మెల్ మాతను దర్శించుకొని పొలాల్లో వేసేందుకు తీసుకొచ్చిన విత్తనాలు పాదాల వద్ద ఉంచారు. ఏటా వర్షాలు మొదలయ్యే సమయంలో కార్మెల్ మాతను దర్శించుకొని పొలాల్లో విత్తనాలు నాటడం తమకు ఆచారంగా ఉందని వారు చెప్పారు.



కొండను ఎక్కేందుకు వెళుతున్న భక్తులు

బక్రీద్ ప్రార్థనలకు ఈద్గా, మసీదులు ముస్తాబు





సిద్ధమవుతున్న ఈద్గా ప్రాంగణం

బక్రీద్‌కు ఏర్పాట్లు

పొన్నూరు : త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు ముస్లింలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈద్ ప్రార్థనల కోసం పొన్నూరులో ఈద్గా, మసీదులు ముస్తాబయ్యాయి. అంజుమన్ ఏ ఇస్లామియా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు షేక్. మాము ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం (ఇటికంపాడు) రోడ్డులోని ఈద్గాలో షామియానా, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈద్గాలో ఉదయం 9 గంటలకు సామూహిక ఈద్ నమాజ్ నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మర్కస్ మసీదులో ఉదయం 6 గంటలకు, అక్సా మసీదులో ఉదయం 6, 8.30, నూర్, నిమ్రా, ఆయేషా, రహిమానియా మసీదులలో ఉదయం 6, ఉమర్, మదీనా మసీదులో 6.15, నూరని మసీదులో 7 , అబూబకర్ మసీదులో 7.30 , జైనబ్, మొహమ్మదిగా, చౌక్, ఫాతిమా మసీదుల్లో 8 , దాహెరా మసీదులో 8.15, ఉస్మానియా, బిలాల్ మసీదుల్లో ఉదయం 9 గంటలకు ఈద్ ప్రార్థనలు జరగనున్నాయి.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



తెనాలిరూరల్: మండలంలోని నందివెలుగు గ్రామానికి చెందిన నల్లూరి పిచ్చయ్య కుమారుడు శ్రీనివాస్‌కు చిన్న మెదడు సమస్య ఉంది. పుట్టినప్పటి నుంచి 15 ఏళ్లు వచ్చినా ఎదుగుదల లేదు. బాలుడి వైద్య ఖర్చుల కోసం గ్రామానికి చెందిన భరోసా స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. కటికి శ్రీకాంత్, పేరం శ్రీలక్ష్మి, నరిశెట్టి మహేశ్వరరావు, పిరాటి రమేష తదితరులు ఉన్నారు.

మంత్రి మనోహర్‌కు అభినందనలు



తెనాలిఅర్బన్: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆదివారం బోసురోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మనోహర్‌ను గజమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సయ్యద్ షబ్బీర్, షేక్ దావూద్, కారంచేడు తహసీల్దార్ మెహర్‌కుమార్, పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడికొండ మండలంలో భారీ వర్షం

తాడికొండ: తాడికొండ మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇప్పటికే రైతులు తమ పంట పొలాలను దున్ని సిద్ధం చేసుకున్నారు. విత్తనం విత్తేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పత్తి విత్తనాలు నాటేందుకు ఇప్పటికే పంట పొలాల్లో సాళ్ళు దున్నగా విత్తనాల కొనుగోళ్ళు కూడా ఊపందుకోనున్న నేపథ్యంలో రైతులకు అందుబాటు ధరలలో విత్తనాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

అలరించిన స్వరాలాపన



నగరంపాలెం: తెలుగువారి సాంస్కృతిక సంగీత కళావేదిక -ఏపీ, నటరత్న డాక్టర్ ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అమరావతిరోడ్ అన్నదాన సమాజం ఆడిటోరియంలో స్వరాలాపన నిర్వహించారు. తెలుగు సినీ లెజెండ్స్, సంగీత దర్శకులు అందించిన మధురమైన గీతాలను పలువురు గాయనీ, గాయకులు అలపించారు. సభికులను, ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో అధ్యక్షులు డి.బాలస్వామి, ప్రధాన కార్యదర్శి కె.బాబూరావు, ఉపాధ్యక్షులు కంచర్ల రాజేంద్రకుమార్, బి.రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తెనాలిలో ఇంటింటికీ ధర్మ ప్రచారం



ధర్మప్రచారం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తెనాలిరూరల్: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటి ధర్మ ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం తెనాలి సాలిపేటలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇచ్చి స్టిక్కర్ అంటించి హిందూ ధర్మం గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తెనాలి ఖండ సంయోజక్ కడియాల సునీల్ కుమార్ మాట్లాడుతూ నగరాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాలలో ఇంటింటి ధర్మ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ నెల 17న ఏకాదశి నగర సంకీర్తనలు చేయాలని, 22, 23 తేదీల్లో పౌర్ణమి సామూహిక హారతులు, 18న హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహించాలన్నారు. బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, నందికంటి రామాంజనేయులు, నేత్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు



ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులతో కమిటీ సభ్యులు

తెనాలిరూరల్: విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి, 500 మార్కులకు పైగా సాధించిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ కార్యక్రమాన్ని పట్టణానికి చెందిన బాబు జగ్జీవన్ రామ్(బీజేఆర్) కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళా క్షేత్రంలో జరిగిన కార్యక్రమానికి కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ అధ్యక్షత వహించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు ప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు. తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, వేమూరు, కొల్లూరు, అమృతలూరు, చుండూరు, చేబ్రోలు మండలాలకు చెందిన విద్యార్థులు 25 మందికి రూ.5 వేలు చొప్పున నగదు, నూతన వస్త్రాలు, కలేజ్ బ్యాగ్, వాటర్ బాటిల్‌ను అందజేశారు. సీనియర్ ఏపీపీ సుద్దపల్లి సుకుమార్, ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్, న్యాయవాది ఇందుపల్లి రాజారాం, ప్రొఫెసర్ పొన్నెకటి రత్నాకర్, మేకల రవికుమార్, బీజేఆర్ కమిటీ సభ్యులు అత్తోట శరత్‌బాబు, సిద్దెల కమలాకర్, నలుకుర్తి సద్గుణ రావు, సుద్దపల్లి నాగరాజు, నలుకుర్తి రమేష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పేద రైతులకు ఉచిత దుక్కి దున్నుడు



ఉచిత దుక్కి దున్నుడు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు గ్రామానికి చెందిన పాలడుగు రంగయ్య, అన్నపూర్ణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద రైతులకు ఉచితంగా దుక్కి దున్నే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు పాలడుగు అంజయ్య మాట్లాడుతూ 1999లో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి రెండెకరాల లోపు పొలం ఉన్న పేద రైతులకు ఉచితంగా దుక్కి దున్నిస్తున్నట్టు తెలిపారు. ఏటా 100 ఎకరాల్లో ఉచితంగా దుక్కి దున్నుతున్నట్టు చెప్పారు. జిల్లాలోని జెడ్పీ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమ శ్రేణి సాధించిన విద్యార్థులకు ఆగస్ట్ 15న నిర్వహించే కార్యక్రమంలో స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్టు తెలిపారు. ఈదర వెంకటపూర్ణచంద్, పాలడుగు సురేంద్ర, గుమ్మడి ప్రసాద్, కర్రి హరనాథరెడ్డి, పాలడుగు సుధీర్, సాల్మన్, పాలడుగు పూర్ణచంద్రరావు, పాలడుగు కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, కిషోర్, నాగేశ్వరరావు, రమేష్, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

ఆలపాటి వెంకట్రామయ్య సేవలు మరువరానివి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ



వెంకట్రామయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ ఉమ

తెనాలిఅర్బన్: ఆలపాటి వెంకట్రామయ్య సేవలు మరువరానివని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ కొనియాడారు. మాజీమంత్రి ఆలపాటి వెంకట్రామయ్య 105వ వర్ధంతిని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న ఆయన విగ్రహానికి ఆదివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా రాష్ట్రానికి విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన మనుమరాలిగా తాను రాజకీయాల్లో కొనసాగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొడాలి శ్రీనివాసరావు, గుమ్మడి రమేష్, వుయ్యూరు రాజశేఖర్, నెలటూరు బెన్ను, తదితరులు పాల్గొన్నారు.

23న హిందూ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర



బ్రోచర్ ఆవిష్కరణ

తెనాలి: హిందూ సామ్రాజ్యాధినేత ఛత్రపతి శివాజీ స్మారక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 23న సాయంత్రం 5 గంటలకు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఛత్రపతి శివాజీ స్మారక సమితి నిర్వాహకులు తెలియజేశారు. శోభాయాత్ర బ్రోచర్‌ను ఆదివారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆవిష్కరించారు. ఛత్రపతి శివాజీ హిందూ సామ్రాజ్య చక్రవర్తిగా పట్టాభిషిక్తుడై ఈ నెల 23వ తేదీకి 350 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్థానిక సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమై పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద ముగుస్తుందని ఈ శోభాయాత్రలో కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు, సమితి సభ్యులు మైలా హరికష్ణ, అంబటి మారుతీరావు, ఈపూరు హరిప్రసాద్, లింగాల రామారావు, రామిశెట్టి గోపి పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామిగా దర్శనమిచ్చిన వేణుగోపాలస్వామి



శ్రీలక్ష్మీ అష్టాక్షరి నారాయణ నిత్య హోమం

నగరంపాలెం: కొత్తపేటలోని జగన్నాథ స్వామి దేవస్థానంలో శ్రీరుక్మిణి సత్య భామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజుకు చేరాయి. ఆదివారం స్వామికి శ్రీలక్ష్మీనరసింహస్వామి అలంకారణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించగా, శ్రీలక్ష్మీ అష్టాక్షరి నారాయణ నిత్యం హోమం చేపట్టారు. ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను దేవస్థానం సహాయ కమిషనర్(ఈఓ), డి.శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు శ్రీఅయోధ్య అయ్యప్ప పర్యవేక్షించారు.